www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 24 జూన్ 2025



వినాయకుడికి వెండి మూషిక వాహనం విరాళం

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం వారి దేవస్థానంకు సుమారు బరువు 7 కిలోలు, రూ.7లక్షలు విలువ గల వెండి మూషిక వాహనంను సోమవారం హైదరాబాద్ వాస్తవ్యులు దాత పంకజ్ కుమార్, వారి కుటుంబ సభ్యులు ఆలయ ఏఈఓ రవీంద్ర బాబుకు అందజేశారు. వీరికి స్వామివారి దర్శన ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

పిజిఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

- సమస్యల పరిష్కారంపై అలసత్వం వద్దు
- ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ జి.విద్యాధరి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ జి.విద్యాధరి వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలోని గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ విద్యాధరితో డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యలు పరిష్కరించే విధంగా పని చేయాలని, ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని, ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 283 అర్జీలు అందగా వివిధ శాఖల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ సర్వే శాఖ 213పోలీస్ 14, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ 2, ఎస్పీడీసీఎల్ 2, డిఆర్‌డిఏ 25, డీఎస్ఓ 2, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 7, గురుకులం 8, పశుసంవర్ధక శాఖ 3, మెప్మా 2, ఇరిగేషన్ 3, మైన్స్ అండ్ జియాలజీ 1, ఎండోమెంట్ 1 అర్జీదారులు వినతులను అందజేశారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరి

ప్రజా ఫిర్యాదులు అలసత్వం చేయకండి

ఏఎస్‌పి రాజశేఖర్ రాజు

చిత్తూరు అర్బన్: ఏఎస్పి రాజశేఖర్ రాజు, పలమనేరు డిఎస్పి డేగల ప్రభాకర్ సోమవారం జిల్లా ఎఆర్ పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 33 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో అలస్యం లేకుండా వాటిని సమర్థవంతంగా పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు అడిషనల్ ఎస్పీని, డీఎస్పీని కలిసి తమ సమస్యలను వినిపించారు. అడిషనల్ ఎస్పీ ఫిర్యాదులకు స్పందిస్తూ బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్, సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదులన్నింటిపై చట్టపరమైన విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా సమస్యలను పరిష్కరించాలంటూ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 33 ఫిర్యాదులు అందగా వాటి వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ తగాదాలు 7, వేధింపులు 3, ఇంటి తగాదాలు 4, భూ తగాదాలు 12, డబ్బు తగాదాలు 5, దారి తగాదాలు 2 ఉన్నాయి.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్‌పి రాజశేఖర్ రాజు

పీజీ ఆర్ఎస్‌కు 10 వినతులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్) కార్యక్రమంలో 10 వినతులు అందినట్లు నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గతవారం అందిన వినతుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ 3, ఫించన్లు 3, రెవెన్యూ 2, తల్లికి వందనం 2 చొప్పున మొత్తం 10 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

రాగిమానిపెంట పంచాయతీలో
అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలి: సిపిఎం

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలం రాగిమానిపెంట పంచాయతీలో ప్రజల నుండి వసూలు చేసిన పన్నులు ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో జమ చేయకుండా అవినీతికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని సోమవారం సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు పంచాయతీ కార్యదర్శి పేదల దగ్గర నుండి బలవంతంగా పన్నులు వసూలు చేసిన ఇంటి పన్నులు రెండు లక్షల 50 వేలు పైగా ఉన్నప్పటికీ కేవలం లక్ష రూపాయలు మాత్రమే ప్రభుత్వానికి జమ చేసి మిగతా డబ్బులను స్వాహా చేసినట్లు ఆరోపించారు. ఈ విధంగా పంచాయతీ నిధుల్లో అవినీతి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక పంచాయతీలోనే ఇంత అవినీతి ఉంటే మండలంలోని అన్ని పంచాయతీల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. లక్షల రూపాయలు పంచాయతీ ఆదాయానికి గండి కొడుతూ ఉంటే ఇక పంచాయతీ అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పంచాయతీల నిధులపై నిఘా ఉండాలని, అలాగే జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం జిల్లా కన్వీనర్ గంగరాజు

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో..?

- ఏళ్ళ తరబడి రాళ్లు తేలిన రోడ్లు
- గుంతలమయంగా నగరి- ఇల్లత్తూరు దారి
- పట్టించుకోని పాలకులు..
- ఇబ్బందిపడుతున్న ప్రజలు



రాళ్లు తేలిన రోడ్డు

ప్రజాశక్తి- విజయపురం: సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు ఏర్పాటు చేయాలనే కూటమి ప్రభుత్వం ఆశయానికి గత పాలన చర్యలు గండి కొడుతున్నాయి. ఫలితంగా సంక్రాంతి ముగిసి ఐదు నెలలు అవుతున్నా నేటికీ ఈ రోడ్లకు మోక్షం లేకుండా పోయింది. మండలంలోని ఇల్లత్తురు నుంచి నగరి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత గుంతలు లేని రోడ్డు ఏర్పాలు చేస్తామని చెప్పి అక్కడక్కడ ఉన్న గుంతల్లో తెల్లరాళ్ల తోలి అర్థాంతరంగా వదిలేశారు. దీంతో ఆరోడ్లపై ద్విచక్రవాహన దారులు, పాదచారులు ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. రాళ్లు తేలిన రోడ్లపై ప్రయాణం తరచూ ప్రమాదాలకు దారితీస్తోంది. గత మూడేళ్లగా అదే పరిస్థితి.. రోడ్డులో అడుగడుగున గుంతలే.. ఈ రోడ్డు మరీ దారుణంగా మారింది.. కూటమి ప్రభత్వం స్పందించి గ్రామాల్లో అర్థాతరంగా నిలిసిపోయిన రోడ్ల పనులతో పాటు మరికొన్ని రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఏళ్ళ తరబడి రాళ్లు తేలిన రోడ్లు

ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు ఆందోళన చెందాల్సిన పరిస్థితి. నగరి నుండి మల్లారెడ్డి కండ్రిగ పైన ఇల్లతూరు రోడ్డులో ఇల్లత్తూరు గ్రామాల ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. కానీ పాలకులు మాత్రం ఈ రోడ్డు మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదు. గ్రామానికి చెందిన కాలేజ్, పాఠశాలకు వెళ్ళాలంటే విద్యార్థులు నరక యాతన అనుభవిస్తున్నారు. పెద్దపెద్ద గోతుల కారణంగా చాలా ప్రమాదాలు సంభవిన్నాయి. ఇక వర్షాకాలం వస్తే ఈ రెండు గ్రామాల ప్రజల అవస్థలు వర్ణాణాతీతం. గోతుల్లో నీరు చేరడంతో వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాలభారిన పడిన సంఘటనలు అనేకం. అయినా సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. నగరి పరిధిలో ఉన్న ఈ రోడ్డు నిర్మాణానికి మోక్షం కలిగించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఆ రోడ్డుపై వెళ్ళాలంటే భయమేస్తుంది

ఈ రోడ్ల గుండా స్కూల్, కాలేజీకి వెళ్ళాలంటే భయం వేస్తోందని, చాలామంది ఆ రోడ్లో పడ్డారని ఆ సంఘటనలు ఇప్పటికీ భయపెడుతూనే ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు. పాలకులు స్పందించి రోడ్డు నిర్మించాలని విద్యార్థులు, ప్రయాణీకుల అవస్థలను దృష్టిలో ఉంచుకుని సత్వరమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా అధ్వానంగా మారిన రోడ్డు

మా బడిని మార్చొద్దు..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పలమనేరు మండలం పెంగరగుంటలోని కోతిగుట్ట గ్రామస్తులు వనజ, బుజ్జెమ్మ, రోజా తమ గ్రామంలోని ఎంపిపి స్కూల్‌లో 1 నుండి 5వ తరగతి వరకు ఉందని, అయితే 3 నుండి 5 వరకు గల తరగతులను పెంగరగుంటలోని పాఠశాలలో విలీనం చేశారని, పెంగరగుంట సమీపంలో ప్రైవేట్ పాల డెయిరీ ఉందని, డెయిరీకి వందల కొద్దీ లారీలు తిరుగుతుంటాయని, తమ పిల్లలను బయట గ్రామాలకు పంపడానికి భయంగా ఉందని, తమ గ్రామంలోనే 1 నుండి 5 వ తరగతి వరకు పాఠశాలను కొనసాగించాలని కోరారు.

మా ఊరిలోనే బడి కొనసాగించండి

ఎస్ఆర్ పురం దిగువ మెదవాడ ఎస్‌టి కాలనీకి చెందిన గాంధీ, ధనలక్ష్మి, దేవి తమ గ్రామంలోని పాఠశాలలో 1 నుండి 5 వ తరగతి వరకు ఉందని, 3 నుండి 5 వరకు తరగతులను ఎగువ మెదవాడ పాఠశాలలో విలీనం చేయడం వలన తమ పిల్లలు ఇబ్బందులకు గురి అవుతున్నారని, 1 నుండి 5 వరకు తమ గ్రామంలోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరిని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎస్ఆర్ పురం ఎంఈఓను ఆమె ఆదేశించారు.

మోడల్ స్కూల్ పేరిట విలీనాలు ఆపాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

రాష్ట్ర ప్రభుత్వం మోడల్ స్కూల్ ఏర్పాటు పేరుతో గ్రామీణ బడులను మూసి వేయడం అత్యంత దుర్మార్గంగా ఉందని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజులు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎన్నో ఏళ్లుగా నడుస్తున్న పాఠశాలలు మూతపడే పరిస్థితి వచ్చిందని, అనేక గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థులతో పాటు గ్రామస్తులు తమ గ్రామ బడులను కాపాడుకొనేందుకు నిరసనలు వ్యక్తం చేస్తున్నా విద్యాశాఖ ఏమాత్రం పట్టించుకోక పోవడం అత్యంత దుర్మార్గంగా ఉందని అన్నారు. కనీసం విలీన పాఠశాలల వివరాలు కూడా ప్రభుత్వం, విద్యాశాఖ బహిర్గతం చేయకపోవడం దారుణంగా ఉందన్నారు. గ్రామాల్లోని పేద బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదివే బడులను విలీనం పేరిట మూసివేస్తే ఎలా అని ప్రశ్నించారు. మోడల్ బడుల విషయంలో ప్రభుత్వం గ్రామీణులకు అన్యాయం చేయాలని చూస్తే జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులను పెద్దఎత్తున ఆందోళనకు పూనుకోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.





5న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జూలై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని డిఎల్‌ఎస్‌ఏ సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి భారతి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రమైన చిత్తూరులో డిఎల్‌ఎస్‌ఏ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి భారతి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా జూలై 5వ తేదీన లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సివిల్ , క్రిమినల్ , చెక్ బౌన్స్, తదితర కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ లోక్ అదాలత్‌లో సమస్యలను పరిష్కరించుకుంటే సమస్య పూర్తి కావడంతోపాటు ఆపిల్ చేసుకునే అవకాశం కూడా ఉండదని తెలిపారు. జూలై 5వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఐదు గంటల వరకు జరిగే ఈ లోక్ అదాలత్ ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్ఎస్ఏ సీనియర్ సివిల్ జడ్జి భారతి

మామిడి రైతులపై తమిళ సినీనటుడి ఔదార్యం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: తిరుపతి నుంచి చెన్నైకి వెళుతున్న తమిళ సినీ నటుడు విజయ్ రాజా (నటుడు శివాజీ రాజా తనయుడు) గంగాధరనెల్లూరు మండలంలోని జైన్ మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద మామిడి రైతులు పడుతున్న అవస్థలను చూసి చలించిపోయాడు. వెంటనే కారును ఆపమని డ్రైవర్‌ను ఆదేశించి, కిందకు దిగి మామిడి రైతుల వద్దకు వెళ్లారు. తోతాపురి మామిడి అమ్మకాల్లో వారు పడుతున్న కష్టాలు, అవస్థలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడున్న రైతులు అందరికీ భోజనం, తాగునీటిని అందించారు. దీంతో మామిడి రైతులు నటుడు విజయ్ రాజాకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్రాకు చెందిన ప్రజాప్రతినిధులు, సినీనటులు తమను పట్టించుకున్న పాపాన పోలేదని, కానీ తమిళనాడు రాష్ట్రానికి చెందిన సినీ నట్లు ఆంధ్రా రైతుల కష్టాలను ఓదార్పుగా భోజనం అయినా పెట్టి తన ఔదార్యాన్ని చాటుకోవడం గొప్ప విషయమని కొనియాడారు.



మామిడి రైతుకు భోజనం ప్యాకెట్లు అందిస్తున్న తమిళ నటుడు విజయ్ రాజా

జీవో నెం.5ను రద్దు చేయాలి

సచివాలయ ఉద్యోగుల నిరసన



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 5ను సవరించాలని, సొంత మండలాల్లో పనిచేసుకునే అవకాశం కల్పించాలని, ప్రమోషన్స్ ఫస్ట్.. ట్రాన్స్ఫర్ నెక్స్, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ఇతర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు కార్యదర్శులు సోమవారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్‌కి తమ న్యాయమైన సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. నాయకులు మహేష్, వినోద్, ప్రతాప్, వెంకటేష్, సతీష్, జానకిరాం పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

8వ రోజూ ఒప్పంద కార్మికుల నిరసన



పుంగనూరులో..

ప్రజాశక్తి- పుంగనూరు: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని కార్మిక సంఘ నాయకుడు రెడ్డిపల్లి శ్రీరాములు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులు సోమవారం 8వ రోజు శిబిరంలో నినాదాలతో హోరెత్తించారు. గత వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్‌లలో ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్న వారి న్యాయమైన సమస్యల పరిష్కరించాలని ఆందోళన చేస్తుంటే కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యాలయాల్లో పనులన్నీ నిలిపివేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పని గంటలు ఎక్కువ ఉన్న ఎలాంటి విసుగు చెందకుండా పనులను చక్కబెడుతుంటే ప్రభుత్వాలు మాత్రం మా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మణ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, ప్రసాద్, గోపాల కృష్ణమూర్తి, లజపతి, శ్రీనివాసులు, చంద్ర, నారాయణ, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

మున్సిపల్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

పలమనేరు: పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు గత వారం రోజులుగా నిరవధికంగా సమ్మె చేస్తున్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేస్తూ మున్సిపల్ కార్యాలయం గేటు ఎదురుగా నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. మిగతా రెగ్యులర్ ఉద్యోగస్తులు లాగా తమను పరిగణించాలని, వారికి వర్తించే అన్ని సదుపాయాలు తమకు వర్తింపచేయాలని, సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని, మినిమం టైం స్కేల్ పాటించాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమ కుటుంబాలకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.



పలమనేరులో..

కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి- కుప్పం రూరల్

పరీక్షలు ఏదైనా బిసిఎన్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగిస్తుందని కుప్పం డిగ్రీ కళాశాల చైర్‌పర్సన్ శాంతా నాగరాజు తెలిపారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయం డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు తెలిపారు. ఈ ఫలితాల ప్రకారం తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి, ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. తమ విద్యార్థులు బి.కామ్ (కంప్యూటర్స్)లో అజిజునిస 9.08, దివ్యశ్రీ 9.05, బిబిఏలో దేవవర్ణిని 8.86, హేమలత 8.86, మువశ్రీ 8.52, బీఎస్సీ (సిఎస్)లో మాధవి 8.58, భరత 8.37, బీఎస్సీ (కెమిస్ట్రీ)లో గీతికి 8.58, స్వర్ణ 8.08, బిసిఎలో సంధ్య 8.55, ధరణి 8.36, హేమలత 8:36 పాయింట్స్ సాధించినట్లు తెలిపారు. అలాగే అడ్వాన్సడ్ అకౌంటింగ్‌లో నలుగురు విద్యార్థులు 10కి10, ఒక విద్యార్థి మాథ్స్‌లో10కి 10 పాయింట్స్ సాధించడం జరిగిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల చైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్ సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు అభినందించారు.



కూటమి సర్కారుపై యువత

కలెక్టరేట్ ఎదుట వైసిపి నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైఎస్ఆర్ యువజన విభాగం సోమవారం భారీ ర్యాలీ చేపట్టింది. ఈ సందర్భంగా ఫీజు రీయింబర్స్మెంట్, నిరుద్యోగ భృతి బకాయిలు విడుదల చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వైయస్ఆర్ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ హేమంత్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొత్తగా ఉద్యోగాలు ఇవ్వక, ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేస్తూనే ఉన్న ఉద్యోగాలు తీసివేస్తూ లక్షలమంది పొట్ట కొడుతోందని అన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన అందక, చదువుకునే లక్షలాది మంది యువత తీవ్రకష్టాలు పడుతున్నారని, పేదలకు ఉన్నత చదువులు సాకారం కావాలన్న సమున్నత లక్ష్యంతో ప్రారంభించిన విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు ఈ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. షెడ్యూల్ ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు టీడీపీ కూటమి సర్కారు స్వస్తి పలికిందని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో స్పెషలిస్ట్ వైద్యుల నియామకం ఆపేశారని, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ కక్షలతో తొలగిస్తున్నారని అన్నారు. యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శులు చెంగారెడ్డి, కిషోర్, దొరబాబు, చంద్రశేఖర్, కిశోర్‌రెడ్డి, కిరణ్ కుమార్, తేజరెడ్డి, రూపేష్, సుబ్బు నాయుడు పాల్గొన్నారు.



దళారీ వ్యవస్థను అరికట్టండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మామిడి రైతులను ధగా చేస్తున్న దళారీ వ్యవస్థను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోటుగారి భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ నాయకులు మామిడి రైతులను ఆదుకోవాలని సోమవారం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. భాస్కర్ మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, జ్యూస ఫ్యాక్టరీల ముందు పడిగాపులు పడతుంటే ప్రభుత్వ యంత్రాగం ఏం చేస్తోందని ప్రశ్నించారు. మామిడి రైతులకు న్యాయం చేయకుంటే ధర్నా, నిరసనలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర చైర్మన్ కె.ప్రభాకర్ రావు, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి టి.వెంకట నరసింహులు, ఎం.గోపాల్ రెడ్డి, బి.సుబ్బారాయులు, పి.ప్రభాకర్, కె.హుమేష్, బుజ్జిరెడ్డి పాల్గొన్నారు.

వైసిపి జనరల్ సెక్రటరీగా కిషోర్‌కుమార్


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని గొల్ల చీమన పల్లి గ్రామ పంచాయతీలోని కె గోవింద్ రెడ్డి కుమారుడు కప్పల కిషోర్ కుమార్ రెడ్డి బైరెడ్డిపల్లి మండల జనరల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ రెడ్డి సోమవారం మాట్లాడుతూ తనపై నమ్మకం వుంచి వైసిపి పదవి అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే పార్టీని 2029లో అధికారంలోకి తెచ్చి జగన్ మోహనరెడ్డిని ముఖ్యమంత్రిగా, వెంకటేగౌడ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి వచ్చేలా చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ్, మొగసాల కృష్ణమూర్తి, మొగసాల రెడ్డెప్ప, జెడిపిటిసి కేశవులకు కృతజ్ఞతలు తెలిపారు.

సత్వర పరిష్కారం: తహశీల్దారు


అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దారు లోకనాథపిళ్లై

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ఫిర్యాదు దారులకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహశీల్దారు లోకనాథ పిళ్లై పేర్కొన్నారు. ఎస్ఆర్‌పురం తహశీల్దారు కార్యాలయం లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమస్యలు పరిష్కరించాలని అర్జీలతో వచ్చిన అర్జీదారులకు త్వరగా సమస్యలు పరిష్కరించాలని తహశీల్దారు తమ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో భాగంగా సోమవారం తహశీల్దారు కార్యాలయానికి పొజిషన్ సర్టిఫికెట్ సమస్య 3, ముటేషన్ 4, భూమి భాగ పరిష్కార కోసం 3 , రేషన్ కార్డ్ సమస్యల పరిష్కారం కోసం ఐదుగురు అర్జీలు సమర్పించారని మొత్తం 18 అర్జీలు అందాయని తహశీల్దారు పేర్కొన్నారు. అందులో మూడు సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం కాగా మిగిలినవి దశల వారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్జీదారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామిక హబ్ కోసం..

భూమి గుర్తింపులో అధికారులు


పారిశ్రామికవాడకు స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఎస్ ఆర్ పురం : ఎమ్మెల్యే ఆలోచనలు అనుగుణంగా మండలంలో పారిశ్రామిక హబ్ కోసం ఆదివారం గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని ఎస్ఆర్ పురం మండలం లో దాసరిగుంట, పాతపాలెం, జిఎంఆర్ పురం క్షీరసముద్రం ప్రాంతాల్లో భూములను గుర్తించారు. సోమవారం ఎస్ఆర్ పురం తహశీల్దారు లోకనాథ పిళ్లై, ఎస్ఆర్ పురం సర్వేయర్ కృష్ణమూర్తి, గంగాధర నెల్లూరు మండల సర్వేయర్‌లు సునీత, జయచంద్ర యుద్ధ ప్రాతిపదికన భూముల గుర్తించే పని చేపట్టారు. రికార్డులు, స్కెచ్‌లు పరిశీలించడంతో భూమి వద్దకు వెళ్లారు. భూమిని పరిశీలించి వచ్చారు.

సుపరిపాలనకు నాంది: ఎమ్మెల్యే


సుపరిపాలనకు తొలి అడుగులో'లో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - యాదమరి: ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షిస్తూ, పాలనలో మార్పులకు నాంది పలుకుతూ సుపరిపాలన దిశగా సాగుతున్నామని ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పేర్కొన్నారు. విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో సోమవారం నిర్వహించిన 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యేకలికిరి మురళీమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై తన అభిప్రాయాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ఇటు అభివృద్ధి, సంక్షేమంలోనూ ముందుకు తీసుకెళ్లడం అభినంద నీయమన్నారు.


విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- రామకుప్పం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రిని సోమవారం టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కూటమినేతల కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలో ప్రతి పేద విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, నోటు పుస్తకాలు విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడమే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్యా బోధనలు, వసతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ2 నారాయణ, బిజెపి నేతలు రాజసింహ, ఆంజనేయప్ప, ఆనంద్, జనార్దన్ రెడ్డి, పాఠశాల చైర్మన్ మంజునాథ్ పాల్గొన్నారు.

'స్లో మోటార్ సైకిల్ రైడింగ్' పోటీల దరఖాస్తుల గడువు పెంపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మోటార్ సైకిల్ నడుపే వారిలో సహనాన్ని, మోటార్ సైకిల్‌ను బ్యాలెన్స్ చేసే సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించేందుకు 100 మీటర్ల స్లో మోటార్ సైకిల్ రైడింగ్ నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో ప్రజలు ఆసక్తి చూపడంతో దరఖాస్తుల తేదీని పోటీదారులు కోరిక మేరకు ఈనెల 30వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హైవే సమస్యను పరిష్కరించండి

జెసికి బండకిందపల్లి గ్రామస్తుల వినతి


నిరసన వ్యక్తం చేస్తున్న బండ కిందపల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి -రొంపిచర్ల: హైవే రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ రొంపిచర్ల మండలం బండకిందపల్లి గ్రామస్తులు చిత్తూరు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెసి విద్యాధరికి తమ సమస్యను విన్నవించుకున్నారు. బండ కింద పల్లి గ్రామ పంచాయతీలో ప్రభుత్వం పీలేరు నుండి కాలూరు వరకు రోడ్డు విస్తరణ పనులు బండ కింద పల్లె గ్రామం మధ్యలో హైవే రోడ్డు నిర్మాణం చేపట్టారని'బండకిందపల్లి గ్రామంలో ఎలాంటి బస్‌షెల్టర్లు గానీ, అండర్ బ్రిడ్జిలు, సబ్ రోడ్డు కానీ ప్లాన్‌లో ఎక్కడ చూపకుండా నిర్మించారని దీంతో గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రోడ్డుకు అవతల వైపు వెళ్లాలంటే దారి లేక, 400 కుటుంబాలు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డుకు అవతల వైపు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వుందని, పాఠశాలలో 80 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. 1,469 ఎకరాల సాగు భూమి వుందని, విద్యార్థులు స్కూలుకు వెళ్లాలన్నా రైతులు వ్యవసాయ పనులు చేసుకోవాలన్నా రోడ్డు దాటాల్సిన పరిస్థితి వుందన్నారు. మూగజీవాలు, పశుగ్రాసం కోసం 20 అడుగుల దూరంలోని తమ వ్యవసాయ భూములకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి వుంది. రోడ్డు దాటేటప్పుడు ఇప్పటికే చాలా ప్రమాదాలు జరిగాయి. ఈ సమస్యను ఇంతకు ముందు ఉన్న కలెక్టర్ వారికి, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ తిరుపతి వారికి పలుసార్లు విన్నవించడం జరిగింది. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదే విషయాన్ని శనివారం ప్రజాశక్తి పత్రిక ద్వారా రైతులు, విద్యార్థులు మరియు గ్రామస్తులు తమ నిరసన ను తెలుసుకున్నారు. ఈ సమస్య దృష్టిలో వుంచుకుని వారు న్యాయం చేయాలని గ్రామస్తులు జాయింట్ కలెక్టర్ విద్యాధరికి విన్నవించుకున్నారు. సానుకూలంగా స్పందించి 'మీ సమస్యని పరిష్కరిస్తామని జేసీ చెప్పారని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండ కిందపల్లె గ్రామ టిడిపి నాయకుడు ఊటుకూరు కోటేశ్వర్ రెడ్డి, సర్పంచ్ అన్సర్ భాష, సామి రెడ్డి, ఉస్మాన్ భాషా, అక్బర్, సయ్యద్ అలీ, అమీర్ బాషా, రమేష్, సలీం, అఫ్సర్, అమర్, తదితరులు తన సమస్యను జేసీకి విన్నవించుకున్నారు.


సోమలలో బోరుమోటారుకు మరమ్మతులు చేస్తున్న వైనం.

బోరు మోటారుకు మరమ్మతులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - సోమల: మండల కేంద్రమైన సోమల బజారు వీధిలోని జామ మాను వద్ద ఉన్న రక్షిత మంచినీటి సరఫరా బోరు మోటారుకు పంచాయతీ అధికారులు సోమవారం మరమ్మతులు చేశారు. సోమల బజారు వీధిలోని జామమాను వద్ద వున్న రక్షిత మంచినీటి సరఫరా బోరు మూడు రోజుల క్రితం కాలిపోవడంతో స్థానికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే పరిష్కరించాలని కోరుతూ ' బోరు మోటారు ఇలా.. తాగునీరు అందేది ఎలా?' శీర్షికన 'ప్రజాశక్తి'లో ఆదివారం వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మజాహర్ సోమవారం కాలిపోయిన బోరు మోటారుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకూడదని ఆలోచించి వెంటనే బోరు మోటారుకు మరమ్మతులు చేయించామని తెలిపారు. 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన వార్తకు స్పందన రావడంతో ఈ ప్రాంత ప్రజలు' ప్రజాశక్తి'కి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఉత్సాహంతో యువకులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: యువత పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణికి నిరసనగా చిత్తూరులో వైసిపి చేపట్టిన యువత పోరుకు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపు మేరకు సోమవారం మండలంలోని కొమరగుంట పంచాయతీ, బందార్లపల్లి గ్రామానికి చెందిన జగదీష్ , ఆర్‌బిఐ కమిటీ ప్రధాన కార్యదర్శి) ఆధ్వర్యంలో వెళ్లారు. ఈ కార్యక్రమంలో , వైస్ ఎంపీపీ మాజీ బట్టి సుబ్రహ్మణ్యం, యువకు లు పాల్గొన్నారు.

మదర్ థెరిసా విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి -గంగవరం: ఈ నెల 22వ తేదీ విడుదలైన ఎస్‌వి యూనివర్సిటీ 3వ సెమిస్టర్ ఫలితాల్లో మదర్ థెరిసా కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల ప్రిన్సిపాల్ యస్ మధుసూధనరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీఏలో షేక్ సాలియా(9.55), ఎస్‌మౌనిక (9.47), ఎస్ షారికా ఆఫ్రీ (9.45), ఎస్ శ్రావ్య (9.38), ఎస్ సిఫాన (9.32) జీఎస్జీపీఏతో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారన్నారు. బీబీఏలో ఎం.హర్షిత (9.33), ఎం నిహారిక (9.31) జీఎస్జీపీఏ మార్కులు పొంది మంచి ఫలితాలు సాధించారని తెలిపారు. ఆర్ భవ్య(9.22), పి భవిత (9.07), విషా ఇస్రా అంజుమ్ (9.07) జీఎస్జీపీఏ సాధించి కళాశాల స్థాయిలో టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. బికాం, బిబిఏ, బీసీఏ, బీఎస్సీలో రెండవ సంవత్సరం మూడవ సెమిస్టర్‌లో 305 డిస్టింక్షన్లు, 135 ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. వీరి విజయానికి కారకులైన విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులను, కరెస్పాండెంట్ ఎం రవీంద్ర బాబు, ఛైర్మన్ ఎం సునీల్, అకడమిక్ అడ్వైజర్ రాజేంద్ర రెడ్డిలు అభినందించారు.


మందులు పరిశీలిస్తున్న వైద్యాధికారులు

తవణంపల్లి పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి-తవణంపల్లి: తవణంపల్లి మండల కేంద్రం తవణం పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టీకాల అధికారి డాక్టర్ హనుమంత రావు సోమవారం తనిఖీచేసి చిన్నపిల్లల కి టీకాల కార్యక్రమం, ఐ ఎల్ ఆర్ (ఐస్ లైన్డ్ రిఫ్రిజరేటర్) లను, ల్యాబ్, ఫార్మసీని పరిశీలించారు. అనంతరం ఏఎన్ఎంలను అందరిని పిలిపించి పిల్లలందరికి సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. వేసిన టీకాలని అదేరోజు ఆన్లైన్ లో ఆర్ సి హెచ్ లో పొందుపరిచాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల వైద్య అధికారులు డాక్టర్ టి ప్రియాంక , టిఎస్ మోహన వేలు , పి కేశవ నారాయణ, ఆరోగ్య పర్యవేక్షకులు డి. రాజశేఖర్, రెడ్డమ్మ, నిర్మలమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


జేసీ విద్యాధరికి వినతిపత్రం అందిస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

గిట్టుబాటు ధర కల్పించాలి

- మామిడి రైతులను ఆదుకోవాలి
- జేసీకి కాంగ్రెస్ నాయకుల వినతి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదు కోవాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ విద్యాధరి చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ వినతిపత్రం సోమవా రం అందించారు. సోమవారం ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా పోటుగారి భాస్కర్ కలెక్టర్‌కు వెళ్లి జేసీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండు చేశారు. కళ్ల ముందే రైతు కష్టం నీరుగారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జైన్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఆయన వెంట కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఛైర్మన్ కామన ప్రభాకర్ రావు, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, కాంగ్రెస్ నెల్లూరు ఇన్‌ఛార్జి మాంగాటి గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ్ల సుబ్బారాయులు, పూతలపట్టు ప్రభాకర్, వెదురు కుప్పం మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందుకూరి హుమేష్, ఎస్‌ఆర్‌పురం మండల కాంగ్రెస్ అధ్యక్షులు బుజ్జిరెడ్డి కుమారీ రెడ్డి, దినకర్‌ప్రసాద్, చిట్టిబాబు, అభిక పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- గ్రామ సర్వేయర్ల పెన్‌డౌన్ నిరసన
- తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి-సోమల: గ్రామ సర్వేయర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత ఐదు సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లు పరిష్కరించే వరకు పెన్‌డౌన్ నిర్వహించి శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలుపుతూ మండల గ్రామ సర్వేయర్లు తహశీల్దా రు బెన్ను రాజ్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భం గా గ్రామ సర్వేయర్లు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన కాకుండా రెవెన్యూ విలేజ్ విస్తీర్ణం ప్రకారం హేతుబద్దీకరణ చేయాలని, సీనియార్టీ ప్రకారం రేషన్ లైజేషన్ ప్రక్రియ చేపట్టాలని, సర్వేయర్లను టెక్నికల్ డిపార్టుమెంట్ చేసి టెక్నికల్ పే స్కేల్ ఇవ్వాలని, జీవో నెంబర్ ఐదును సవరించి సొంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వాలని, అంతర్ జిల్లాల బదిలీలు ఇవ్వాలని, రీసర్వేకి సంబంధించిన టీఏ, డీఏ బిల్లులు జీటీ, జీవీ వెంటనే ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని, రీ సర్వే సమయంలో తగిన పరికరాలు , సమయం, ఆర్ఓఆర్ సెటిల్ చేయకుండా తీవ్ర ఒత్తిడికి గురి చేయడం వల్ల మనోవేదనకు, అనారోగ్యానికి గురవుతున్నామని మండలంలోని గ్రామ సర్వేయర్లు తహశీల్దారుకు వినతి పత్రం అందించారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్వేయర్లు సుకన్య, మల్లీశ్వరి, జ్యోతి, క్రాంతి, విజయ్, సునీల్, మునిరెడ్డి, ఇర్ఫాన్, దిలీప్, సాదిక్ కోరారు.


తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ సర్వేయర్లు

అధికారం ఉన్నప్పుడు ప్రజా సమస్యలు గాలికి

- ఇప్పుడు ధర్నాలు అంటే ఎలా?- జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రెడ్డప్ప నాయుడు



ప్రజాశక్తి- పుంగనూరు: వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న గత ఐదేళ్లుగా ఏ ఒక్క రంగాన్ని పట్టించుకోకుండా శాండు, మైండు, లిక్కర్ వేల కోట్లు పోగేసుకుని నేడు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలతో ధర్నాలు చేపట్టడం ఏమిటని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పాలడుగు రెడ్డప్ప నాయుడు విమర్శించాడు. యువత కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 2018లో టిడిపి ప్రభుత్వ 6 లక్షల మందికి నిరుద్యోగ భృతి ఇస్తే 2019లో అధికారంలోకి వచ్చిన నువ్వు ఒక్క కలం పోటుతో ఆ స్కీమే లేకుండా చేశావు అన్నారు. 2019 - 24 మధ్య నిరుద్యోగుల కోసం ఒక్క డీఎస్సీ కూడా నువ్వు నిర్వహించలేదుకదా అన్నారు. అదే ఈరోజు అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం నిరుద్యోగుల కోసం డీఎస్సీ నిర్వహిస్తూ 16,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందన్నారు. చివరి సంవత్సరం లో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంటు రూ.3400 కోట్లు బకాయిలు పెట్టి విద్యార్థులను వారి తల్లిదండ్రులను నట్టేట ముంచి వెళ్లారని ఆరోపించారు. నేడు దేశ విదేశాల నుంచి వివిధ కంపెనీలు ఆహ్వానించి రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల కోసం కంపెనీలు నెలకొల్పి వాటిలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. అయినా నిరుద్యోగ భృతి ఇవ్వడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, విధి విధానాలు రూపకల్పన చేస్తున్నారన్నారు. అతి తొందరలో ప్రతి ఒక్క నిరుద్యోగికి నిరుద్యోగ భృతి కల్పిస్తామన్నారు.

ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

ఏపీఎస్ ఆర్‌టిసి ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం మండలం నాయనూరు పంచాయతీ పెద్దవంక గ్రామంలోని కనకనాచమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం అన్నారు. దేవాదాయ శాఖ అధికారులుతో ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం ఆ ఆలయాన్ని సోమవారం కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు వారికి సాదర స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలోని ప్రధాన ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కనకనాచమ్మ ఆలయ అభివృద్ధిలో భాగంగా దేవాదాయ శాఖ అధికారులు ఆలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 3.8 కోట్ల రూపాయల మంజూరు చేయడం జరిగిందని, కావున ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనియర్ చంద్రశేఖర్, పంచాయతీ టిడిపి ప్రసిడెంట్ కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ మురుగేష్, యూనిట్ ఇన్‌చార్జ్ శివకుమార్, నాసప్ప పాల్గొన్నారు.


ఆలయాన్ని సందర్శించిన ఏపీఎస్ ఆర్‌టిసి ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం

క్రైం న్యూస్



న్యాయవాది మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

న్యాయవాది దారుణ హత్య

ప్రజాశక్తి -విజయపురం: తమిళనాడుకు చెందిన న్యాయవాది దారుణంగా హత్యకు గురైన సంఘటన విజయ పురం మండలం పాతర్కడు సమీపం లో సోమవారం చోటుసుకుంది. స్థానికుల కథనంమేరకు..తిరువల్లూరు జిల్లా తిరుత్తని తాలూకా అరుంబాక్కం గ్రామానికి చెందిన న్యాయవాది వెంకటేశ్వర్ రెడ్డి (55) తండ్రి పేరు రామిరెడ్డి గుర్తుతెలియని వ్యక్తి కత్తులతో దాడి చేసి హత్య చేశారు.వెంకటేశ్వర్ రెడ్డి కనకమ్మ సత్రం నుంచి పాతర్కాడ్ మీదుగా వస్తుండగా దుండగులు వెంటబడి పాతఆర్కాడు వద్ద కత్తులతో దాడి చేశారు . ఈ సంఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డి.ఎస్.పి మహమ్మద్ అజిత్ బాషా, సీఐ భాస్కర్, ఎస్సై రంగా తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసుదర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య



ప్రజాశక్తి -బంగారుపాళ్యం : కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలం లోని గుండ్ల కట్టమంచి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసు లు కథనం మేరకు.. గుండ్లకట్టమంచి గ్రామానికి చెందిన మురళి భార్య మైసూర (27) కుటుంబ కలహా లతో సోమవారం మధ్యాహ్నం ఇంట్లోనే మోల్డింగ్‌కు వున్న కొక్కికి ఉరి వేసుకుని మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బంగారు పాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారికి జెడ్‌పి ఛైర్మన్ ఆశీర్వాదం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ రాజా రెడ్డి అన్న కృష్ణారెడ్డి తేజస్విని కుమారుడిని చిత్తూరు జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు అలియాస్ వాసు ఆశీస్సులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం కోలార్ రత్న మినీ హాలులో నామకరణం చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు అలియాస్ ,వాసు హాజరై తేజస్విని కృష్ణారెడ్డి కుమారుడైన శశాంక్ రెడ్డి నామకరణానికి హాజరై ఆశీస్సులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని పార్టీల నాయకులు పార్టీలకు అతీతంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎం కొత్తూరు, పంచాయతీ సభ్యులు, బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రెస్, పోలీస్ స్టిక్కర్ లపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో కొందరు జర్నలిస్టులు, పోలీసులు కాకున్నా తమ వాహనాలపై 'ప్రెస్', 'పోలీస్' అని స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పి విఎన్‌మణికంఠ చందోలు హెచ్చరించారు. ఈ మేరకు ఎస్పి సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.'ప్రెస్', 'పోలీస్' విధులతో సంబంధం లేనివారు వాహనాలపై స్టిక్కర్లను అతికించుకోవడం చట్ట వ్యతిరేకమని ఎస్పి తెలిపారు. సంబంధిత గుర్తింపు కార్డులు లేకుండా తిరిగే వారి వాహనాలను స్పెషల్ డ్రైవ్ చేపట్టి తనిఖీ చేస్తామని ఎస్పీ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కొందరు అనధికారికంగా వాహనాలకు సైరన్లు బిగించి ధ్వని కాలుష్యానికి, తోటి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు తెలిసిందని, అలాంటి వాహనాలను తనిఖీలలో గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పూతలపట్టు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి -యాదమరి: పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గా లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన యదమరి మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహించారు. సాధారణ బదిలీలలో భాగంగా పూతలపట్టు మండలానికి బదిలీ అయ్యారు.

తల్లికి వందనం వర్తింపజేయాలి

ప్రజాశక్తి -పలమనేరు: మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకాన్ని పారిశుద్ధ్య కార్మికులకు వర్తింప చేయాలని, అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటియూసి నాయకులు కోరారు. సోమవారం మధ్యాహ్నం పలమనేరు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమావేశం ఆ సంఘం నాయకులు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జోరేపల్లి రామచంద్రయ్య, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్. నాగరాజు, పలమనేరు నియోజకవర్గం సిపిఐ కన్వీనరు సి. చెన్నకేశవులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకాన్ని పారిశుద్ధ్య కార్మికులకు వర్తింప చేయాలని, అవుట్సోర్సింగ్ కార్మికులను పేర్మనెంట్ చేయాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా అదనపు సిబ్బందిని పెంచాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించాలని కోరారు. ఈ సమావేశంలో పలమనేరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస, సుందరయ్య, చంద్రప్ప, జయమ్మ, శంకరమ్మ, చంద్రయ్య,సరస్వతి, సత్యబాబు, చిన్నబ్బ పాల్గొన్నారు.

మదిపట్లపల్లి పంచాయతీ కార్యదర్శి బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి -ఐరాల: సాధారణ బదిలీలో భాగంగా సుబ్రహ్మణ్యం మదిపట్లపల్లి పంచాయతీ కార్య దర్శిగా సోమవారం బాధ్యత లు స్వీకరించారు. ఆయ న గతంలో పాలకూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ సాధారణ బదిలీ భాగంగా సోమవారం మదిపల్లి పంచాయతీ సెక్రటరీగా బాధ్యతలు తీసుకున్నారు, పంచాయతీ పరిధిలోని తమ పరిధికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సుపరిపాలన తొలి అడుగు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విజయవాడ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎస్పీ మణికంత చందోలు, చుడ ఛైర్‌పర్సన్ కటారి హేమలత, నగర మేయర్ అముద పాల్గొన్నారు.